క్లుప్తంగా

గ్రామదేవతలకు మొక్కులు



రాయపర్తి: మండలకేంద్రంలోని మాల కాలనీవాసులు గ్రామదేవతలకు బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామదేవతలైన మారెమ్మ, ముత్యాలమ్మ దేవతలకు ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండి గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు బల్లెం యాదగిరి, వెంకన్న, యాకయ్య, శ్రీనివాస్, మధు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : ఐనవోలు, కొండపర్తి సబ్‌స్టేషన్ ఒంటిమామిడిపల్లి, ముల్కలగూడెం, వెంకటాపూర్ ఫీడర్ల పరిధిలో చెట్టుకొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒంటిమామిడిపల్లి గ్రామవ్యవసాయ బావులకు, ముల్కలగూడెం, నర్సింహులగూడెం, వెంకటాపూర్ గ్రామ ఇండ్ల, వ్యవసాయబావులకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామస్తులు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

గాలివానకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు



నర్సంపేట రూరల్ : గాలివాన బీభత్సానికి ఇంటిపైకప్పులు ఎగిరిపోయిన సంఘటన మండలంలోని మహేశ్వరం గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహేశ్వరం గ్రామానికి చెందిన కొలుగూరి రజిత, బాబులకు చెందిన ఇళ్ల పై కప్పు రేకులు గాలివానకు పూర్తిగా ఎగిరిపోయి ధ్వంసమయ్యాయి. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

దామెర: రోడ్డు దాటుతున్న బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పసరగొండ క్రాస్‌వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఊరుగొండకు చెందిన వినయ్, హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన సాయిచరణ్ బైక్‌పై పసరగొండ క్రాస్‌వద్ద జాతీయరహదారిపై రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో పరకాలకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంతో వేగంగా వచ్చి ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. సాయిచరణ్‌ను అపోలో ఎన్ఎస్ఆర్ ఆస్పత్రికి, ఒకరిని గార్డియన్, మరొకరికి ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా సాయిచరణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటనా స్థలా నికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

మెగా రక్తదాన శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వాగ్బాట యోగా అండ్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల మధుసూదన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ హనుమకొండ నేతృత్వంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పెసరు నిరంజన్‌రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రక్తదాతల నుంచి 56 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది సేకరించారు. కార్యక్రమంలో వాగ్బాట, వా కర్స్ ప్రతినిధులు రాంచందర్, శ్రీశైలం, సాంబయ్య, సుభాష్, నవీన్‌రెడ్డి, రాంబాబు, కన్న య్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఖిలా వరంగల్: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా గురువు అశోక్ ఆర్య అన్నారు. బాల సంస్కార్ -2024 కార్యక్రమంలో భాగంగా వరంగల్ శంభునిపేటలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో యోగా, భారతీయ కళలు, ఆచారాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై బాలలకు యోగా ఆసనాలు నేర్పించారు. అశోక్ ఆర్య మాట్లాడుతూ సేవా సమితి ఏర్పాటు చేసిన యోగా శిక్షణను బాలబాలికల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దయాకర్, శ్రీరామ్, శరత్‌బాబు, రవిబాబు, వెంకటరమణ, రమేష్, ఉదయ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

లోతు దుక్కులతో రైతుకు మేలు

- సారవంతంగా మారనున్న భూమి
- చీడ పీడలు నశించిపోతాయి..
- పంట దిగుబడి అధికం



లోతు దుక్కులు దున్నుతున్న ట్రాక్టర్

చెన్నారావుపేట: వేసవి దుక్కులు లోతుగా దున్నడంతో అధిక ప్రయోజనాలు పొందవచ్చు. నేల గుల్లగా మారి వేసవిదుక్కుల వల్ల భూమిలో ఉన్న పురుగులు, బ్యాక్టీరియా, గతంలో వేసిన పంట తాలూకు వ్యర్థాలు బయటకు వచ్చి నాశనమవుతాయి. అలాగే భూమి సారవంతంగా మారుతుంది. దీంతో పంటల దిగుబడి బాగా పెరిగి సకాలంలో పంట చేతికొస్తుంది. దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది.

ఎప్పుడు చేయాలి..

వేసవిలో పంట కోసిన తర్వాత తొలకరి వానలు కురిసే వరకు భూమి ఖాళీగా ఉంటుంది. రెండు నుంచి మూడు నెలల పాటు భూమి ఎండకు ఎండి గట్టి పడుతుంది. జూన్‌లో ఏ పంట వేయాలో, వేయబోయే పంటను బట్టి ఎన్నిసార్లు భూమిని దున్నాలో నిర్ణయించుకోవచ్చు. ఏటా ఒకే లోతుకు భూమిని దున్నడం వల్ల నల్లరేగడి భూముల్లో అడుగున గట్టి పొరలు ఏర్పడతాయి. దీంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా చేయటమే కాకుండా మొక్క వేళ్లు లోనికి వెళ్లకుండా చేస్తాయి. దీంతో అవి గిడసబారి పోతాయి. ఎండాకాలం దుక్కి లోతుగా దున్నటం వల్ల వర్షాకాలంలో పడే వర్షాలకు భూమి గుల్లగా తయారై పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. అలా కాకుండా తొలకరిలో వర్షాలు పడిన తర్వాత దుక్కి దున్నితే పంటలకు అనుకూలంగా ఉండదు. వేసవి దుక్కులపై మందులకు పెట్టు బడులు చాలా వరకు తగ్గించుకోవచ్చు.

చెరువు మట్టితో అనేక లాభాలు



ప్రతి రైతు చెరువు మట్టిని పొలాల్లో పోసుకోవాలి. రైతులు వేసవి దుక్కులు దున్నేటప్పుడు 6 నుంచి 7 అంగుళాల పైన నేల దున్నినట్లయితే భూమి సారం మరింత పెరుగుతుంది. పంట దిగుబడి అధికంగా ఉంటుంది.

- ఎం.శశికాంత్, వ్యవసాయ అధికారి

ప్రయోజనాలు..

- మట్టి ఉష్ణోగ్రత పెరుగుతుంది..
- వేసవి దుక్కుల వల్ల భూమి వదులుగా అయి తద్వారా భూమిలోని క్రిమికీటకాలు చనిపోతాయి.
- వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. పంట వేసినప్పుడు మొక్క వేరు లోపలికి నీరు వెళ్లి బలంగా ఉంటాయి.
- లోతు ఎక్కువగా దున్నడం వల్ల కలుపు గింజలు బయటపడతాయి. వాటిని పక్షులు తినటంతో కలుపు కూడా తగ్గుతుంది. కొన్ని రకాల కలుపు మొక్కలు బయటపడి వేడికి చనిపోతాయి.
- అధిక వర్షాలు కురిసినా భూమి కోతకు గురికాకుండా ఉంటుంది.
- మొలకశాతం పెరుగుతుంది. సకాలంలో పంట వేసుకోవడానికి పొలం అనుకూలంగా ఉంటుంది. సేంద్రియ, రసాయన ఎరువులు కలిపి దున్నినట్లు ఉంటుంది.
- పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి మోడులు భూమిలో అడుగు భాగానికి చేరి కుళ్లి ఎరువుగా ఉపయోగపడుతాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఎండీ.ఇస్మాయిల్

సంగెం: మండలంలోని ఎల్గూర్‌రంగంపేటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అఖిలభారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎండీ. ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎల్గూర్‌రంగంపేటను సందర్శించారు. గత 15 రోజుల నుంచి అక్కడికి రైతులు వరి ధాన్యంను తీసుకుని వచ్చారని ఇంకా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడుతుంటే ధాన్యం తడవకుండా రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు సరిపడా టార్పాలిన్లు ఏర్పాటు చేసి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో మండల ఐలయ్య, సాంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం రోడ్డెక్కిన కుటుంబం



వరంగల్- నర్సంపేట ప్రధానరహదారిపై న్యాయం చేయాలని బైఠాయించిన రాజేష్ కుటుంబ సభ్యులు

దుగ్గొండి: తన ఇంటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని తనను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని న్యాయం చేయాలని కోరుతూ ఓ కుటుంబం రోడ్డుపై బైఠాయించిన ఘటన మండలంలోని గిర్నిబావిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వికలాంగుడు తుమ్మలపెల్లి రాజేష్ తల్లిదండ్రులు గత కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ఇదే క్రమంలో గిర్నిబావిలో ప్రధాన రహదారిపై పక్కన ఉన్న రెండు అంతస్తుల ఇంటిని సోదరుడు తుమ్మల పెల్లి రాజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొన్నాళ్లకు విషయం తెలుసుకున్న రాజేష్ తన వాటా తనకు రిజిస్ట్రేషన్ చేయాలని ఎంత మొరపెట్టుకున్నా నీకు ఎక్కడిది అంటూ దాటవేస్తున్నాడు. దీంతో తనకు న్యాయం చేయాలని ప్రధాన రహదారిపై భార్య మౌనిక, కుమారుడు, కూతురుతో కలిసి బైఠాయించాడు. ఇదే సమయంలో వరంగల్ నుంచి నర్సంపేటకు వస్తున్న సీఐ రాజగోపాల్ ఘటన స్థలంలో ఆగి న్యాయం చేస్తానని వికలాంగుడైన రాజేష్‌కు నచ్చజెప్పి ఆందోళనను విరమింప జేశాడు. అయితే ఆందోళకారుడికి గ్రామస్తులంతా ఐకమత్యంగా అండగా నిలబడటం విశేషం.

ప్రభువా కరుణించు..

- పెద్దల స్మరణలో ప్రజలు
- తిమ్మరాయినిపహాడ్‌లో దివ్య బలిపూజ



పెద్దల సమాధులను సుందరంగా అలంకరించి ప్రార్థనలు చేస్తున్న భక్తులు

చెన్నారావుపేట: గ్రామాన్ని పుట్టించి ప్రభువు పిలుపునందుకుని మృతినొందిన మృతుల (పెద్దల ఆత్మల) నిత్య విశ్రాంతి కోసం బుధవారం సాయంత్రం ఊరుపండుగ (శతాబ్ది ఉత్సవాలలో) భాగంగా సమాధుల తోటలో సమష్టి బలిపూజ కార్యక్రమాన్ని విచారణ గురువు తుమ్మ యాగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తిమ్మరాయినిపహాడ్‌లో మధ్యాహ్నం ప్రజలతో పాటు ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సమాధుల తోటలో అలంకరించిన సమాధులపై పూలుచల్లి కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం గ్రామానికి చెందిన గురువులు, ఇతర దేశాల్లో, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో స్థిరపడిన గురువులు, స్థానిక గురువు, గ్రామానికి చెందిన సుమారు 2 వేలకు పైగా ప్రజల ఆధ్వర్యంలో బలిపూజ నిర్వహించారు. మృతి చెందిన పెద్దల ఆత్మలకు శాంతి, నిత్యవిశ్రాంతి కొరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గుడి పెద్దలు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



దుగ్గొండి: ఆర్థికసాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు



రాయపర్తి: బాధిత కుటుంబానికి సరుకులు అందజేస్తున్న గ్రామస్తులు

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన నర్ర మోహన్‌రెడ్డి ఐదు రోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1978–79 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం బాధితుడి ఇంటికి చేరి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. మోహన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో చక్రపాణి, సాయిరెడ్డి, రమేష్, జనార్దన్‌రెడ్డి, ఓదెలు, చంద్రయ్య, సంజీవరెడ్డి, యాదగిరి, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సరుకులు అందజేత

రాయపర్తి: అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన రేవుల లచ్చయ్య కుటుంబానికి ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి నెలకు సరిపడా సరుకులను పంపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అందించగా వాటిని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. బియ్యంతో పాటు, నిత్యావసర సరుకులను పంపించినట్లు ఆయన తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిలుముల ఎల్లమ్మ యాకయ్య, మొలుగూరి పున్నమయ్య, గ్రామస్తులు శ్రీను, భిక్షపతి, గొని శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడిన జనార్దన్



గీసుకొండ: సీపీఎం నాయకుడు దివంగత ఆకుల జనార్దన్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడాడని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి అన్నారు. బుధవారం చంద్రయ్యపల్లిలో జనార్దన్ 16వ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన వ్యక్తిత్వం జనార్దన్‌ది అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కూసం రమేశ్, ఎంబాడి సారంగం, కుటుంబ సభ్యులు ఆకుల రుద్రప్రసాద్, అనసూర్య, మంజుల, వెంకటేశ్వర్లు, మాధవి, శ్రీనివాస్, మమత, రవీందర్, పరిమళ, నాగరాజు, హర్షిత, రిత్విక్, నందన్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తెచ్చి అభివృద్ధి చేశాం

నడికూడ : గ్రామాభివృద్ధి కోసం గత ప్రభుత్వం అప్పగించిన అభివృద్ధి పనులను అప్పులు తెచ్చి పూర్తి చేశామని, ఇప్పటి వరకు బిల్లులు రాలేదని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు వాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతోందని పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామం బాగుండాలి, అభివృద్ధి పథంలో నడవాలనే ఉద్దేశంతో విపత్కర పరిస్థితుల్లో కూడా అభివృద్ధి పనులను నిలుపుదల చేయకుండా పూర్తి చేశామన్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధికు సంబంధించిన రూ.50 లక్షలు వరకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కొనసాగితే రానున్న రోజుల్లో పనులు చేసేందుకు ఎవరూ ముందుకురారని తెలిపారు. మాజీ సర్పంచ్‌లకు ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు.

పరామర్శ

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన ఎర్రబెల్లి సుదర్శన్‌రావు (94) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, బండి సుధాకర్, ప్రముఖ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు వేర్వేరుగా పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు. వారి వెంట పూర్ణచందర్‌రావు, సోమేశ్వర్‌రావు, చందర్‌రావు, చిర్ర శ్రీనివాస్, కంకర శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

హైస్కూల్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

నర్సంపేట : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మండలంలోని మచ్చాపురం గ్రామంలోని ప్రగతి హైస్కూల్ యాజమాన్యం నర్సంపేట డివిజన్‌లోని వివిధ మండలాలు, గ్రామాల్లో హైస్కూల్ ఐఐటీ మెడికల్ ఫౌండేషన్(సీబీఎస్‌ఈ) పేర్లతో ప్రచారం నిర్వహిస్తున్నారని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమాల ప్రకారం వరంగల్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు, స్కూళ్ల పేర్ల ముందు టెక్నో, మెడికల్ ఐఐటీ ఈ టెక్నో, సీబీఎస్‌ఈ పేర్లతో ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న హైస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, వినయ్, రాజేష్, రఘు పాల్గొన్నారు.

ఆర్థికసాయంతో రోడ్డు మరమ్మతు



గుంతలలో మొరం పోయిస్తున్న జయరాజ్

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్ రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉంది. ఇదే గ్రామానికి చెందిన పాదర్ డాక్టర్ ఎటుకూరి మైఖేల్ ఆర్థికసాయంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎటుకూరి జయరాజ్ బుధవారం మొరంతో గుంతలు పూడ్చివేయించాడు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలుగా ఉండటంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండటంతో మైఖేల్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ఆర్థికసాయం అందించారన్నారు. దీంతో నంబర్‌వన్ కాలనీ నుంచి తిమ్మరాయినిపహాడ్ శివారులోని చంద్రుతండా వరకు మొరంతో గుంతలు పూడ్చివేశామన్నారు. ఎటుకూరి థామస్, దేవదానయ్య, బాలజోజి, ప్రవీణ్, జోసఫ్, రమేష్, తదితరులు అభినందించారు.

నూతన పీఆర్‌సీ అమలు చేయాలి



మాట్లాడుతున్న పులి దేవేందర్

హన్మకొండ: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నూతన వేతన సవరణను అమలు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023, జూలై 1 నుంచి నూతన పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం చెల్లించాలని సూ చించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఆర్‌ఎస్ రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించడం సంతోషకరమన్నారు. ఇది చర్చల వరకే పరిమితం కాకుండా త్వరగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. పీఆర్టీయూ జయశంకర్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ మాట్లాడుతూ ఈ వేసవిలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలన్నారు. సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పున్నంచందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లబోజు సుధాకర్, రాష్ట్ర నాయకుడు బోడ రాంజీ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన నాగపురి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనితో పాటు 1991 సంవత్సరంలో ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌లో చదువుకున్న పూర్వవిద్యార్థిలు మహేష్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. మిత్రులు సతీష్, వాసు, పాపని రవీందర్, మూల ప్రవీణ్, సుగ్రీవుడు, వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



ఎల్గూరురంగంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపక బృందం

సంగెం: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన, నైతిక విలువలతో కూడిన విద్య అందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు మామిళ్ల బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం 46 డిగ్రీల ఎండవేడిమిని లెక్కచేయకుండా ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల కోసం అధ్యాపక బృందంతో కలిసి తిమ్మాపూర్, ఎల్గూర్‌రంగంపేట, ఎల్గూర్‌స్టేషన్ పరిధిలోని తండాలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పదో తరగతి పాసైన విద్యార్థులను వారి తల్లితండ్రులను కలిసి తమ కళాశాలలో చేర్పించాలని కోరారు. కార్పొరేట్ కళాశాల స్థాయిలో తమ కళాశాలలో మంచి మార్కులు వస్తున్నాయని పూర్వ విద్యార్థుల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిల్‌కుమార్, యాకసాయిలు, నాగరాజు, కుమారస్వామి, మాదవి తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష గదిని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

నర్సంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటానమస్ కర్రికులంలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్షల కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ ప్రశ్నాపత్రం ఆవిష్కరించారు. పరీక్షలు సమర్థవంతంగా, కట్టుదిట్టంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఐ.శివనాగశ్రీను, సహాయక నియంత్రణ అధికారులు డాక్టర్ బి.రమేష్, పి.త్యాగయ్య, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.నరేందర్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ జి.ప్రసూన, ఎం.సమ్మయ్య, డాక్టర్ జె.లకన్‌సింగ్, డాక్టర్ టి.సుమతి, డాక్టర్ ఎం.శైలజ, డాక్టర్ వి.పూర్ణచందర్, డాక్టర్ కుమారస్వామి, ఏఓ ఎస్.స్వరూపరాణి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టిసారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

దామెర : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ శారద, ఫీల్డ్ అసిస్టెంట్లు, వనసేవకులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పరకాల : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని దామెర ఏఎస్సై ఇనుగాల రాజురెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత నెల రోజులుగా జరుగుతున్న ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు, అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. క్రీడల్లోనే పోటీ పడాలని, వ్యక్తిగతంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్లేయర్ అవార్డు గంధ్ర సాయి ఈశ్వర్ సాధించగా ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా అల్లం రణధీర్, బౌలర్‌గా నవదీప్ అవార్డులను అందుకున్నారు. దామెర గ్రామానికి చెందిన ఓ క్రికెట్ క్రీడాకారుడు రూ.5వేల విలువ చేసే క్రికెట్ బ్యాట్‌ను ఉత్తమ క్రీడాకారుడికి అందించారు. క్రికెట్ క్రీడాకారులకు టిఫిన్స్, అరటిపండ్లు, కోడిగుడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ బొజ్జం అరుణ్, సమృద్, చింటూ, ఆదర్శ్, తులసి, ఆలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.